క్లుప్తంగా

నేటి నుంచి శిక్షణా తరగతులు

గడివేముల:మండల పరిధిలోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు గ్రామ పంచాయతీల పరిపాలన విధానం, తాగునీరు, శానిటేషన్ తదితర అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్త గురువారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటీ నుంచి శిక్షణా తరగతులు

పాణ్యం: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉప సర్పంచ్‌లు, ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ ఉంటుందని చెప్పారు.

ఇష్టానుసారంగా చెత్తబుట్టల పంపిణీ

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో టీడీపీ నాయకులు చెత్తబుట్టలను ఇష్టానుసారంగా పంపిణీ చేసినట్లు ఎంపీటీసీ సభ్యుడు సైమన్ తెలిపారు. సర్పంచ్ ఎర్రగుడి శేఖర్‌కు కూడా తెలియకుండా తమకు అనుకూల కుటుంబాలకు చెత్తబుట్టలు అందజేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. టీడీపీ నాయకులు చెప్పిన విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి కుటుంబానికి చెత్తబుట్టలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. రీ సర్వేలో భాగంగా తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి సభలు నిర్వహిస్తున్నామన్నారు. 18వ తేదీ పలకుదొడ్డి, 19న ఎం సోమాపురం (తిమ్మందొడ్డి), 22న పోలకల్, 23న బురాన్‌దొడ్డి, 24న గుండ్రేవుల, 25న కొండాపురం, 26న కొత్తకోట, 29న కంబదహాల్ సదస్సులు ఉంటాయని వివరించారు. ప్రజలు తమ సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఓర్వకల్లు: మండలంలో రీ సర్వే నిర్వహించిన గ్రామాలలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. 18వ తేదీన తిప్పాయపల్లె, 19న ఎన్ కొంతలపాడు, 22న లొద్దిపల్లె, 23న హుసేనాపురం,24న కేతవరం, 25న పాలకొలను, 26న గుట్టపాడు, 29న కన్నమడకల, 30న శకునాల గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. అదేవిధంగా నవంబర్ 1 వ తేదీన సోమయాజులపల్లె, 2న ఉయ్యాలవాడ, 5వ తేదీన ఉప్పలపాడు గ్రామాలలో సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేటి నుంచి గ్రామసభలు

కోడుమూరు రూరల్ : భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసం ఈనెల 18వతేదీ నుంచి 24వతేదీ వరకు మండలంలోని ఐదు పల్లెల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. ఈనెల 18వతేదీ శుక్రవారం అమడగుంట్ల, 19న వర్కూరు, 22న పులకుర్తి, 23న ముడుమలగుర్తి, 24న అనుగొండ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రీసర్వేలో సమస్యలున్న రైతులు అర్జీలు సమర్పిస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కల్లూరు: గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూములు, రీసర్వేకు సంబంధించి ఏవైన సమస్యలుంటే రైతులు గ్రామసభలో నమోదు చేసుకుంటే పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. 18న పందిపాడు, 19 రెమడూరు, 22 బొల్లవరం, 23 కొంగనపాడు, 24 తడకనపల్లె, 25 సల్కాపురం, 26 కె.మార్కాపురం, 29 పెద్దటేకూరు, 30 నాయకల్లు గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు. అదేవిధంగా నవంబర్ 1న ఉలిందకొండ, 2 బస్తిపాడు, 5పుసులూరు, 6 చిన్నటేకూరు, 7 ఎ.గోకులపాడులో గ్రామ సభలు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మునగాకు ప్రాముఖ్యతను తెలుసుకోవాలి



మొక్కను నాటుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్ : మునగాకు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం మండలంలోని ముడుమలగుర్తి ఐసీడీఎస్ అధికారులు మునగాకు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలను నాటారు. కార్యక్రమానికి ఎంపీడీఓ రాముడు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను నాటారు. మునుగాకు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణయ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు... వ్యర్థాల నిలయాలు!



ఈర్లదిన్నె గ్రామంలో చిట్టడవిని తలపిస్తున్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు



పోలకల్ గ్రామంలో చెన్న సోమేశ్వరస్వామి ఆలయం సమీపాన ఖాళీ స్థలంలో దిబ్బను తలపిస్తున్న చెత్తాచెదారం

సి.బెళగల్: ప్రజారోగ్యం అధ్వానంగా మారుతోంది. ప్రత్యేకించి పల్లెల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లోని జన నివాస కాలనీలలోని ఖాళీగా ఉన్న ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. గృహాల మధ్య, శివారు ప్రాంతాలలోని ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలకు తోడు ఆయా ప్రాంతాల్లో మురుగునీరు చేరి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రజల ఇళ్ల మధ్యన ఉండే ఖాళీ ప్రాంతాలు పందులు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. అదేవిధంగా వీధులలోని చెత్తను కొంత మంది ఖాళీ స్థలాల్లో వేస్తుండటంతో దిబ్బలుగా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చెత్తకుతోడు మురుగునీరు సైతం ఖాళీ స్థాలాల్లో చేరుతుంది. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

పల్లెల్లో ప్రబలుతున్న రోగాలు

మండలంలో 18 గ్రామా పంచాయతీలకు గాను దాదాపు అన్ని గ్రామాల్లో ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాలు ఉన్నాయి. ముఖ్యంగా మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు పోలకల్, ముడుమాల, బురాన్‌దొడ్డి, కొత్తకోట, ముడుమాల తదితర గ్రామాలల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. దీంతో పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా మారింది. ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. చిన్నారులు సీజనల్ వ్యాధుతో ఇబ్బందులు పడుతున్నారు. ఈర్లదిన్నెతో పాటు పోలకల్, సి.బెళగల్ గ్రామాల్లో తరచుగా డెంగీ లక్షణాలతో ప్రజలు జబ్బున పడుతున్నారు. అయితే వ్యాధి నిర్ధారణ అయిన సందర్భంలో మాత్రం జిల్లా అధికారులు, వైద్యులు గ్రామాల్లో పర్యటించి మొక్కుబడిగా పారిశుద్ధ్య పనులను చేపట్టి చేతులు దులుపుకుంటున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

ప్రజలు రోగాల బారిన పడుతున్నారు



మా ఊరిలో చాలా ప్రాంతాలు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మురునీరు కూడా ఉంటుంది. చాలా రోజులుగా ఇదే పరిస్థితి. ముఖ్యంగా మా ఎస్సీ కాలనీ ప్రజలు మురుగునీటితో చాలా ఇబ్బంది పడుతున్నారు. అప్పుడప్పుడు డెంగీ లక్షణాల జ్వరంతో మగ్గుతున్నారు. ఒకరిద్దరు నెలల తరబడి ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రాణాలతో బయట పడ్డారు.

– ప్రేమ్‌కుమార్, ఈర్లదిన్నె గ్రామం

ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలి

చాలా గ్రామాల్లో చెత్తకుప్పలు దిబ్బెలను తలపిస్తున్నాయి. చెత్త చెదారంతోపాటు మురుగు నీరుచేరి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాలు కురిశాక ఈ ప్రాంతాల్లో మురుగునీరు చాలా రోజులు నిల్వ ఉంటుంది. దోమలు విజృంభిస్తుంటాయి. అధికారులు స్పందించి గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో ఉన్న ముళ్ల పొదలను, చెత్త తొలగింపు చేయించాలి.

– రాజేష్, పోలకల్

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రైవేట్ వ్యక్తులకు చెందిన స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ప్రైవేట్ వ్యక్తుల స్థలాలకు నోటీస్‌లు ఇస్తాం. అదేవిధంగా పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అందరి సహకారంతో పరిసరాల శుభ్రత సాధ్యం.

– ఈశ్వరయ్య స్వామి, ఈఓఆర్డీ, సి.బెళగల్ మండలం

శిక్షణా తరగతులను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నగిరి శ్రీనివాసులు

గడివేముల: ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం గడివేములలో గురువారం నిర్వహించిన ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. 21వ తేదీ నుంచి ఆరు రోజులపాటు నిర్వహించే 1,2 తరగతుల ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను సుదూర ప్రాంతాల్లో నిర్వహించడం సమంజసం కాదన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆరురోజులపాటు శిక్షణ కోసం ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు ఉంటే ఆయా కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అనారోగ్యంతో ఉన్నవారికి, చిన్నపిల్లల తల్లులకు, వృద్ధ తల్లిదండ్రులు కలిగిన ఉపాధ్యాయులకు కష్టసాధ్యమని, ప్రభుత్వం స్పందించి శిక్షణ తరగతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, నాగన్న, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, నాగయ్య, జిల్లా మహిళా కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. జ్యోతుల మహోత్సవం



ఖడ్గశావను ప్రదర్శిస్తున్న భక్తులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో వెలసిన చౌడేశ్వరీమాత జయంతి సందర్భంగా గురువారం తెల్లవారు జామున ప్రారంభమైన జ్యోతుల మహోత్సవం ఉదయం 7 గంటల వరకు వైభవపేతంగా సాగింది. ప్రతి ఏడాది దసరా పర్వదినం ముగిసిన ఐదు రోజుల తర్వాత నిర్వహించే జ్యోతుల ఉత్సవంలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి అనాదిగా వస్తున్న ఆచారాల ప్రకారం పూర్వస్థానానికి చేర్చారు. అక్కడ అమ్మవారికి బలి సమర్పరణ చేసి, భక్తులు సమర్పించిన జ్యోతులను వెలిగించారు. జ్యోతులను భక్తులు తలపై పెట్టుకొని నృత్య ప్రదర్శనల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు ప్రదర్శించిన నందికోల సేవ, ఖడ్గ శావలు చూపరులను అబ్బురపరచాయి. చౌరకత్తులతో గాయపడిన శరీరంపై అమ్మవారి పసుపు బండారు పట్టిస్తే మానుతాయనేది భక్తుల విశ్వాసం.





అశేష భక్తజన సందోహాల మధ్య ఊరేగుతున్న అమ్మవారు, నందికోల సేవలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. కోడుమూరులోని పెద్దబోయవీధిలో ఉన్న వాల్మీకి విగ్రహానికి కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి పూజలు చేశారు. వాల్మీకి మహర్షి మానవాళికి జాతికి దిశ నిర్దేశాన్ని ఇచ్చారని కోట్ల గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచు మాదులు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, నాయకులు లింగన్న, రాఘవేంద్ర, కర్ణ, కట్టెల శ్రీనివాసులు, లింగమయ్య, లక్ష్మిప్రసాద్, రాము, వాల్మీకులు పాల్గొన్నారు.

గూడూరులో...

గురువారం గూడూరులోని నగర పంచాయతీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్.అస్లాం, లక్ష్మన్న, కో–ఆప్షన్‌మెంబర్ రామాంజినేయులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొని వాల్మీకి మహర్షికి పూజలు నిర్వహించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో గురువారం వాల్మీక జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల,ఎంపీపీ బొంతల మునెప్ప, అధికారులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోలకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమణ, బ్రాహ్మణదొడ్డిలో సర్పంచ్ దస్తగిరి, సంగాల గ్రామంలో మాజీ సర్పంచ్ నాగన్న ఆధ్వర్యంలో మహర్షి జయంతి వేడుకలు జరిగాయి. సాయంత్రం మహర్షి చిత్రపటాన్ని పురవీధులలో బాణసంచా కాలుస్తూ, మేళతాల మధ్య ఊరేగించారు.

పాణ్యం: మండలంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాణ్యంలోని వాల్మీకి దేవాలయం వద్ద వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో వాల్మీకీ మహర్షి చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి యూత్ సభ్యులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఉయ్యాలవాడలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ట

ఓర్వకల్లు: మహర్షి వాల్మీకి జయంతిని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, కన్నమడకల, నన్నూరు గ్రంథాలయాలలో వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలతో నివాలులర్పించారు. అదేవిధంగా ఉయ్యాలవాడలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కార్యక్రమంలో నాయకులు పశుల వెంకటేశ్వర్లు, ఎల్లరాముడు, సుబ్బరాయుడు, బట్టు పుల్లయ్య, దస్తగిరి, తలారి శివ, గోతం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డీడీ శ్యామల, ఎంపీపీ మునెప్ప, అధికారులు,బైక్‌ర్యాలీలో పాల్గొన్న వాల్మీకులు ,ఉయ్యాలవాడలో ప్రతిష్ఠించిన వాల్మీకి విగ్రహం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

కోడుమూరు రూరల్ : ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ.నారాయణ డిమాండ్ చేశారు. గూడూరు మండలంలోని గూడూరు, చనుగొండ్ల గ్రామాల్లో సీపీఎం శాఖా మహా సభలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ అంటూ గొప్పులు చెప్పుకోకుండా సమస్యల పరిష్కరంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలన్నారు. గూడూరులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన 4ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా పూరి చేసి ప్రజల నీటి కష్టాలను తీర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మోహన్, నాయకులు దానమన్న, మద్దిలేటి, సోమలింగడు, రంగన్న, మధు, రామాంజినమ్మ, కృష్ణయ్య, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు



ఉప్పలపాడులో భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సి.బెళగల్, గొల్లలదొ డ్డి,బురాన్‌దొడ్డి గ్రామాల్లో గురువారం రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధికారులతో కలిసి భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి శ్యామల, ఎంపీడీఓ రాణెమ్మ, పీఆర్, ఆర్ డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు ఏఈ వెంకటప్రకాష్, గోనేనాయక్, సమంత్, ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, ఏపీఎం రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట,ఎల్‌కే తాండ,ఒండుట్ల గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు ఏపీడీఓ బాలాజీ నాయక్ తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్త, ఏపీఓ వెంకటరమణ, ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరులో పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఈఓఆర్డీ నాగేష్‌తో కలిసి సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సామన్న భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఏపీ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని భైరాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, కాల్వ, గుడుంబాయి తండాలో అభివృద్ధి పనులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు పంచాయతీ రాజ్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి, ఏపీఓ కుమార్‌సాయినాథ్, సర్పంచులు గంగాధర్‌రెడ్డి, శకుంతలమ్మ, అయ్యస్వామి, వెంకటేశ్వర్లు, దీప్తిబాయి, ఎంపీటీసీ సభ్యులు సరోజమ్మ, రజాక్ బాష, ఖాదర్‌బాష, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన తుపాన్



సుగాలిమెట్ట పిన్నాపురం రోడ్డులో నీటమునిగిన వరి పైరు

పాణ్యం: తుపాన్ రైతులను ముంచుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు నీటిపాలయ్యాయి. మరో 20 రోజుల్లో ఇంటికి రావాల్సి వరి దిగుబడులు తుపాన్ వలన నీటిలో మునిగాయి. పాణ్యం మండలంలో దాదాపు 95హె క్టార్‌లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా. అదేవిధంగా పొగాకు, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారు. ఆరబెట్టుకున్న దిగుబడులు తుపాన్ మూలంగా తడిసిముద్ద అయ్యాయి. పంట నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఎనిమిది ఎకరాల్లో వరి నీటమునిగింది



ఖరీప్‌లో వరి పంటను 12ఎకరాల కౌలు భూమిలో సాగు చేశాను. ఎకరానికిరూ. 35–40వేల వరకు ఖర్చు వచ్చింది. మరో 20రోజులోల వరి పంట చేతికొచ్చేది. తుపాన్ వలన పంట పూర్తిగా నీట మునిగిపోయింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– గడివేముల వీరాంజినేయులు కౌలురైతు

95హెక్టార్లలో వరి నష్టం

మండలంలో 95హె క్టార్‌లో వరి పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపించాం. క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సూచనలు జారీ చేశాం. పంటలకు ఎక్కడ నష్టం జరిగినా నివేదిక తయారు చేయమని చెప్పాం.

–జయప్రకాష్‌రెడ్డి, వ్యవసాయశాఖ మండల అధికారి

తడిసిన మొక్కజొన్న ధాన్యం



తడిచిన మొక్కజొన్న విత్తనాలను చూపుతున్న రైతు సద్దల మధుకిషోర్



తడిచిన మొక్కజొన్న విత్తనాలను ఆరబెడుతున్న రైతులు

కర్నూలు (రూరల్) : తుపాన్ రైతులను ముంచింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రత్యేకించి మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొక్కజొన్న రైతులకు పెట్టుబడి కూడా రానిపరిస్థితి నెలకొంది. పసుపల గ్రామానికి చెందిన రైతు సద్దల మధు కిషోర్‌కు చెందిన మొక్కజొన్న దిగుబడులు తడిసిముద్దయ్యాయి. తనకున్న రెండు ఎకరాలతో పాటు మరొక ఐదు ఎకరాలు కౌలు తీసుకుని మొక్కజొన్న పంటను పండించాడు. వారం క్రితం పంటను కోశాడు. రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు వర్షాలకు తడిసి ముద్దయ్యాయి. క్వింటాం రూ. 2,200 చొప్పున కొంటానని మాటిచ్చిన వ్యాపారి ఇప్పుడు రూ.1,600 మాత్రమే ఇస్తానంటున్నాడని బాధిత రైతు మధు కిషోర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. దిగుబడుల అంతంతమాత్రమే వచ్చాయని, ధర కూడా రావడం లేదని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.